క్లుప్తంగా

ఆస్పత్రి భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న మంత్రి ఈశ్వర్, కలెక్టర్ యాస్మిన్‌బాషా, ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: జిల్లా కేంద్రంలో ఆదివారం రూ.16 కోట్లతో నిర్మించే క్రిటికల్ కేర్ ఆస్పత్రి భవన నిర్మాణానికి, రూ. 3.60 కోట్లతో నిర్మించే కేంద్ర ఔషధ గిడ్డంగి భవన నిర్మాణానికి మంత్రి కొప్పుల ఈశ్వర్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, కలెక్టర్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్లు మకరంద్, బీఎస్ లత, తదితరులు పాల్గొన్నారు.

శిలఫలకాలు తొలగింపు



తొలగించిన శిలాఫలకాలు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని క్రిటికల్ కేర్ హాస్పిటల్ భవన నిర్మాణానికి, కేంద్ర ఔషధ గిడ్డంగి భవన నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆదివారం తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. శిలాఫలకాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పేరు లేకపోవడం, ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో రెండు శిలాఫలాకలను తక్షణమే తొలగించాలని, ప్రొటోకాల్ ప్రకారం జెడ్పీ చైర్‌పర్సన్, ఇతర ప్రతినిధులతో తిరిగి శిలాఫలకాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సంజయ్ కలెక్టర్ యాస్మిన్‌బాషాను కోరారు. దీంతో అధికారులు వాటిని తొలగించారు.

ఒంటరితనం భరించలేక వృద్ధురాలి ఆత్మహత్య



నర్సవ్వ మృతదేహం

గంభీరావుపేట(సిరిసిల్ల): వృద్ధాప్యంలో ఒంటరితనం భరించలేక గంభీరావుపేట మండలకేంద్రానికి చెందిన దీటి నర్సవ్వ(60) వృద్ధురాలు ఆదివారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఒంటరితనం, అనారోగ్యం కారణాలతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మరొకరు..

గంభీరావుపేట(సిరిసిల్ల): తాగుడుకు బానిసై, ఆర్థిక ఇబ్బందులకు తాళలేక జీవితంపై విరక్తి చెందిన గంభీరావుపేట మండలకేంద్రానికి చెందిన చెరుకు సత్యనారాయణ(55) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. సత్యనారాయణ ఎలాంటి పనిచేయకుండా ఇంటి వద్దే ఉంటూ తాగుడుకు బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తి జీవితంపై విరక్తి చెంది శనివారం పురుగుల మందు తాగాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

బడిబాటలో ఉపాధ్యాయులు

- విద్యార్థులను పాఠశాలలో చేర్పించేందుకు ఇంటింటా ప్రచారం



పారండ్లలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాలరూరల్: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యాకమిటీల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో మెరుగైన విద్యాబోధనతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్ తదితర వసతులు కల్పించడం జరుగుతుందని ఉపాధ్యాయులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో 509 ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత, 185 ఉన్నత పాఠశాలలున్నాయి.

3 నుంచి 17 వరకు..

జిల్లా వ్యాప్తంగా ఈనెల 3 నుంచి 17 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లతో పాటు, విద్యార్థులు ఆటో, వ్యాన్లల్లో వెళ్లి అలసటకు గురవుతారని ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు, యువజన సంఘాలు వినూత్న ప్రచారం చేపడుతున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం సర్కార్ బడులను బలోపేతం చేసేందుకు మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా మౌలిక వసతులు కల్పిస్తోంది. ప్రభుత్వ స్కూళ్లలో అందిస్తున్న అన్ని సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటా వివరిస్తూ విద్యార్థులను బడిలో చేర్పిస్తున్నారు.

ఫీజులు భరించలేక..



ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల భారం అధికమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన చేస్తుండడంతో మా పిల్లలను సర్కార్ బడికే పంపిస్తున్నాం. ప్రభుత్వ స్కూళ్లలో ఆంగ్ల బోధన ప్రవేశపెట్టి నాణ్యమైన విద్యనందిస్తున్నారు.

– గాలిపల్లి విజయ్‌కుమార్, విద్యార్థి తండ్రి

మెరుగైన విద్యాబోధన



తల్లిదండ్రుల కోరిక మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇంగ్లిష్ బోధన ప్రారంభించాం. ఉచిత పుస్తకాలు, డ్రెస్‌లతో పాటు మరెన్నో సౌకర్యాలు కల్పించి విద్యాబోధన చేస్తున్నాం. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులే ముందంజలో ఉంటారు.

– ఎ.రాంరెడ్డి, యూపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మంథని: ముత్తారం మండలంలోని లక్కారం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఆదివారం ఒక్కసారిగా మంటలు చెలరేగి పలువురు రైతులకు చెందిన గడ్డివాములు, బోరు పైపులు దగ్ధమయ్యాయి. మంటలు ఎగిసి పడడంతో అప్రమత్తమైన రైతులు ఆర్పేందుకు యత్నించగా మంటలు అదుపులోకి రాకపోవడంతో మంథనిలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి మంటలు ఆర్పారు. అప్పటికే రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది.

హరితహారం చెట్ల నరికివేత



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కామారెడ్డి–సిరిసిల్ల ప్రధాన రహదారికి ఇరువైపులా హరితహారంలో భాగంగా నాటిన చెట్లను ఆదివారం అల్మాస్‌పూర్‌కు చెందిన ఓ రియల్టర్ నరికివేశాడు. మండల కేంద్రంలోని తన అపార్ట్‌మెంట్‌కు అడ్డుగా ఉన్న చెట్లను నరికివేశాడు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని హరితహారంలో భాగంగా గ్రామగ్రామాన మొక్కలు నాటుతుంటే కొందరు ఇలా తమ భవనాలకు అడ్డుగా ఉన్నాయని తొలగిస్తున్నారు. హరితహారం కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని మూడు నెలల క్రితం ఎల్లారెడ్డిపేట ఈవో ప్రవీణ్‌కుమార్‌ను కలెక్టర్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. హరితహారం మొక్కలకు స్థానిక గ్రామపంచాయతీ సిబ్బంది నిత్యం రెండు పూటలా ట్రాక్టర్‌తో నీళ్లు పట్టి బతికిస్తుంటే కొందరు ఇలా మొక్కలను నరికివేస్తున్నారు.

సెల్‌ఫోన్ వాడొద్దన్నందుకు..

- పదోతరగతి విద్యార్థిని బలవన్మరణం



పోలె శరణ్య (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): పదోతరగతిలో మంచి జీపీఏతో పాసైన ఓ విద్యార్థిని సెల్‌ఫోన్ వాడొద్దని మందలించడంతో వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బోయినపల్లి మండలం విలాసాగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. విలాసాగర్‌కు చెందిన శేఖర్–లావణ్య దంపతుల కూతురు పోలె శరణ్య (16), ఇటీవలే పదోతరగతిలో 8.3 జీపీఏతో పాసైంది. శనివారం సెల్‌ఫోన్ చూస్తుండగా శరణ్యను తండ్రి మందలించడంతో రాత్రి తల్లిదండ్రులతో కలిసి ఇంట్లోనే పడుకుంది. తెల్లారి చూసేసరికి శరణ్య కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. గ్రామంలో వెతుకుతుండగా సాయంత్రం ఓ బావిలో శరణ్య శవమై కనిపించింది. సెల్‌ఫోన్ వాడొద్దని మందలించినందుకు మనస్తాపం చెందిన శరణ్య మర్లపేట నుంచి విలాసాగర్ వెళ్లే దారిలోని ఓ వ్యవసాయ బావిలో దూకి బలవన్మరణం చెందినట్లు తండ్రి శేఖర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ పేర్కొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి దుర్మరణం



రాజ్‌కుమార్ (ఫైల్)

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని జ్యోతినగర్ ప్రాంతంలో ట్రాక్టర్ ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్‌కు చెందిన గాజుల రాజ్‌కుమార్(28) వ్యవసాయం చేస్తుంటాడు. శనివారం రాత్రి చింతకుంటలోని ఐకేపీ సెంటర్‌లో ఉన్న తన తమ్ముడు చంద్రశేఖర్‌కు టిఫిన్ బాక్స్ ఇవ్వడానికి బైక్‌పై బయలుదేరాడు. కోర్టు నుంచి చింతకుంట వెళ్లే మార్గంలో వెనక నుంచి వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి, ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

వెల్గటూర్ : ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు మృతిచెందిన సంఘటన గొల్లపల్లి మండలం శెకల్ల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఠాకూర్ సాయితేజ సింగ్ (21) శనివారం రాత్రి స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంపై శెకల్ల నుంచి జగిత్యాలకు వెళ్తుండగా గొల్లపల్లి మండల కేంద్రంలోని నల్లగుట్ట శివారు మూల మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో సాయితేజ్ సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి బాబాయ్ ఠాకూర్ సుధీర్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భక్తుడి హఠాన్మరణం



కిష్టయ్య మృతదేహం

కొండగట్టు(చొప్పదండి) : కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారి ఆలయంపై హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలానికి చెందిన ఆజె కిష్టయ్య (70) మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కిష్టయ్య ఆదివారం స్వామివారి దర్శనానికి వెళ్తుండగా కొండపై ఉన్న పాద రక్షల స్టాండ్ వద్ద కుప్పకూలి మృతిచెందినట్లు ఏఎస్‌ఐ రమణరెడ్డి తెలిపారు. అర్చకులు ఆలయాన్ని మూసివేసి సంప్రోక్షణ అనంతరం తిరిగి ప్రారంభించారు.

కేసు నమోదు

సారంగాపూర్: మండలంలోని పోతారం గ్రామ శివారులో ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న సనసన్ నాయక్ (56) గుండెపోటుతో ఆదివారం మృతిచెందగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై మనోహర్‌రావు తెలిపిన వివరా ప్రకారం.. సనసన్ నాయక్ ఇటుకబట్టీలో పనిచేసి ఇంటికి వెళ్లగా కొద్దిసేపటికే గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. చికిత్స నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతిచెందాడు. మృతుడి భార్య దేవక్ నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోతారం గ్రామ శివారులో కుటుంబ సభ్యులతో కలిసి మృతుడి అంత్యక్రియలు నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు.

చెర్ల కొండాపూర్‌లో గడ్డి కట్టలు దగ్ధం

రాయికల్(జగిత్యాల): మండలంలోని చెర్ల కొండాపూర్ గ్రామంలో ఏసల రవీందర్, ఇందూరి గంగారాం అనే రైతులకు చెందిన సుమారు వెయ్యి గడ్డి కట్టలకు ఆదివారం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో జగిత్యాల నుంచి సకాలంలో చేరుకుని మంటలు ఆర్పివేశారు. దీంతో భారీ ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. బాధిత రైతులకు రూ.50వేల నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అంబారిపేటలో పర్యటించిన రాజ్యసభ సభ్యుడు



గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సురేశ్‌రెడ్డి తదితరులు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని అంబారిపేటలో రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఇటీవలే గ్రామానికి చెందిన చీటి విజయమ్మ మృతిచెందగా ఆమె భర్త మాజీ సర్పంచ్ విద్యాసాగర్‌రావును పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ గోపు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ శ్రీరాముల ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు అండగా ఎమ్మెల్సీ కవిత

- జాగృతి యూత్ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్



దివ్యాంగుడికి ఎల్‌వోసీ పత్రం అందిస్తున్న మల్లేశ్

మల్లాపూర్ : దివ్యాంగులకు జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అండగా నిలుస్తున్నారని భారత జాగృతి యూత్ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని రేగుంటలో దివ్యాంగ యువకుడు మంద రమేశ్ (25)కు మంజూరైన రూ.1.25 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన మంద రమేశ్ రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడని ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్సీ కవిత సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.1.25లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారన్నారు. కాగా ఎల్‌వోసీ పత్రాలను ప్రజాప్రతినిధులతో కలిసి రమేశ్‌కు అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే విద్యాసాగర్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ కుందేళ్ల నర్సయ్య, ఉపసర్పంచ్ మంద మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ నిమ్మల భూమారెడ్డి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు సురకంటి తిరుపతి రెడ్డి, రైతుబంధు కమిటీ గ్రామాధ్యక్షుడు సురకంటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చాంద్‌పాషాకు సరస్వతీ బాయి ఫాల్కే అవార్డు



అవార్డు అందుకుంటున్న చాంద్‌పాషా

మల్యాల(చొప్పదండి): అంతర్జాతీయ స్థాయిలో గల్ఫ్ కార్మికులకు సేవలందిస్తున్న సామాజిక కార్యకర్త డాక్టర్ షేక్ చాంద్‌పాషా సరస్వతీ బాయి ఫాల్కే అవార్డు అందుకున్నారు. భారతీయ సినీ ప్రపంచానికి బీజం వేసిన దాదాసాహెబ్ ఫాల్కే భార్య సరస్వతీ భాయి ఫాల్కే పేరిట నెలకొల్పిన అవార్డును జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ షేక్ చాంద్‌పాషాకు ముంబైలో జరిగిన సమావేశంలో అందజేసి, ఘనంగా సన్మానించారు. రెండు దశాబ్దాలకు పైగా గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంతోపాటు, గల్ఫ్‌లో మృతిచెందిన కార్మికుల మృతదేహాలను స్వగ్రామానికి తరలించి, కంపెనీల నుంచి కార్మికులకు రావాల్సిన బకాయిలు, వేతనాలు ఇప్పిస్తూ, అంతర్జాతీయ స్థాయిలో చాంద్‌పాషా సేవలందిస్తున్నారన్నారు. సినీ నిర్మాతలు, డైరెక్టర్ల చేతుల మీదుగా డాక్టర్ చాంద్‌పాషాతో పాటు కరీంనగర్ జిల్లాకు చెందిన కవయిత్రి డాక్టర్ సయ్యద్ సమీనా పర్వీన్ అవార్డులు అందుకున్నారు.

మారుతి రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మారుతిరెడ్డి, సాయితేజను సన్మానిస్తున్న జీవన్‌రెడ్డి

రాయికల్: పబ్లిక్ సర్వీస్‌లో 132వ ర్యాంకు సాధించిన అయిలాపూర్ గ్రామానికి చెందిన ఏనుగు శివ మారుతి రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. ఆదివారం మూటపెల్లి గ్రామంలో పబ్లిక్ సర్వీస్ ర్యాంకు సాధించిన ఏనుగు శివమారుతి రెడ్డి, అదే గ్రామానికి చెందిన ఏఈ ట్రాన్స్‌కోగా ఎంపికైన అరుగుల సాయితేజను సన్మానించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. నేటి యువత ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, తల్లిదండ్రులు, గురువులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రావు, యువజన నాయకులు మహిపాల్ రెడ్డి, మండ రమేశ్, చింతలపెల్లి గంగారెడ్డి, ఆరె శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి, తిరుపతి, విష్ణు పాల్గొన్నారు.

చెరువులో దూకి ఒకరి ఆత్మహత్య

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: పట్టానికి చెందిన బొట్టుపెల్లి రేణుక(45) మహిళ అనారోగ్యంతో పట్టణంలోని పెద్దచెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై విజేందర్ తెలిపిన వివరాల ప్రకారం, రేణుక భర్త గతేడాది మృతిచెందడటంతో కూలి పని చేసుకుంటూ జీవిస్తోంది. భర్త చనిపోయినప్పటి నుంచి ఒంటరిగానే జీవిస్తోంది. ఈక్రమంలో అనారోగ్య సమస్యలు తలెత్తడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆయన నేత్రాలు సజీవం

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–1 లో మజ్దూరుగా పనిచేస్తున్న బొడ్డు రాయమల్లు (51) సింగరేణి కార్మికుడు ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రాగా సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి హైదరాబాద్‌లోని ఎల్‌వీప్రసాద్ ఐ బ్యాంకుకు తరలించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు, లయన్స్ క్లబ్ ప్రతినిధి త్రివేది అభినందించారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం చందనపూర్ శివారులోని జల్లారం సొసైటీ తాళ్లలో బొల్లంపెల్లి సారయ్యగౌడ్ అనే గీత కార్మికుడు ఆదివారం తాటి చెట్టుపై నుంచి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. తోటి కార్మికులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చందనపూర్ దుబ్బపల్లికి చెందిన సారయ్యగౌడ్ రోజు లాగే ఉదయం కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశత్తు చెట్టుపై నుంచి కిందపడ్డాడు. దీంతో సారయ్యగౌడ్‌కు తీవ్ర గాయాలు కాగా తోటి కార్మికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించినప్పటికీ రాకపోవడంతో ఆటోలో గోదావరిఖని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పెద్దూర్‌లో..

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులో తాటిచెట్టు ఎక్కుతుండగా జారి కిందపడిన గీతకార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన విడుగురాళ్ల బాగయ్య గీత కార్మికుడు రోజువారి వృత్తిలో భాగంగా ఆదివారం ఉదయం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారీకింద పడ్డాడు. ఈ ప్రమాదంలో బాగయ్య కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి గీతకార్మికులు బాధితుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



తాజ్‌బాబా మృతదేహం

రామగుండం: పట్టణంలోని విద్యుత్‌నగర్‌కు చెందిన తాజ్ బాబా(18) యువకుడు ఆదివారం రాత్రి విద్యుత్ షాక్ తగిలి మృతిచెందాడు. విద్యుత్‌నగర్‌లో నివాసముండే ఫెరోజ్ అనే ఆటోడ్రైవర్ కుమారుడు తాజ్‌బాబా సమీపంలోని తన బంధువుల ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో రాత్రి భారీగా వీచిన ఈదురుగాలులతో ఇంటిపైకప్పు రేకులు లేవకుండా బండరాళ్లు పెడుతుండగా పైనున్న విద్యుత్ తీగలను గుర్తించకపోవడంతో విద్యుత్ షాక్‌కు తగిలి కిందపడ్డాడు. స్థానికులు గుర్తించి హుటాహుటిన గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై రామగుండం ఏఎస్సై పులి సుదర్శన్‌ను వివరణ కోరగా మృతిచెందిన విషయం వాస్తవమేనని, వారి నుంచి ఏలాంటి ఫిర్యాదు అందలేదని స్పష్టం చేశారు.

ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

మంథని: ముత్తారం మండలకేంద్రంలో ఆదివారం పెయ్యల చంద్రయ్య(62) తన ఇంటి వద్దనున్న చెట్టును తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు జారీ కింద పడి తీవ్రగాయాలపాలయ్యాడు. ఈక్రమంలో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ముత్తారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈదురుగాలులకు విరిగిపడిన వృక్షం



చెట్టును ట్రాక్టర్‌తో తొలగిస్తున్న దృశ్యం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని నగునూరు శివారులో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులకు ఓ వృక్షం విరిగి, రోడ్డుపై పడింది. దీంతో కరీంనగర్–రాయపట్నం రహదారిపై ఇరువైపులా పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. స్థానికులు ఆర్‌అండ్‌బీ అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ చెట్టును తొలగించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. చివరకు సర్పంచు ఉప్పుల శ్రీధర్ ఆధ్వర్యంలో బ్లూకోల్ట్స్ పోలీసులు జేసీబీతోపాటు బ్లేడ్ ట్రాక్టర్‌తో చెట్టును తొలగించారు. అనంతరం వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. దాదాపు గంటపాటు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు వర్షంలో ఇబ్బంది పడ్డారు.

పాల వ్యాన్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



శంకరపట్నం(మానకొండూర్): కేశవపట్నం పోలీస్ స్టేషన్ సమీపంలో పాల వ్యాన్ ఢీకొని, ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. శంకరపట్నం మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన జనగాం మనోజ్ శనివారం అర్ధరాత్రి బైక్‌పై వస్తుండగా హుజూరాబాద్ వైపు వెళ్తున్న పాల వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలు కాగా ఈఎంటీ సతీశ్‌రెడ్డి ప్రథమ చికిత్స అందించి, కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం రేకులపల్లి–తాళ్ల ధర్మారం గ్రామాల మధ్య వ్యవసాయ బావిలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఏఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం... రెండు గ్రామాల మధ్య ఉన్న వరివాగులోని బావిలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉందని, రేకులపల్లి గ్రామస్తుడు ఎలగందుల అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ముస్తాబాద్: జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 1996–97 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను నేమరువేసుకున్నారు. వివిధ వృత్తుల్లో స్థిరపడిన తమను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. రోజంతా స్నేహితులతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పర్శరాములు, ఆనంద్‌రావు, దేవదాస్, రాంరెడ్డి, కనకయ్య, సుధాకర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు అబ్రమేని దేవేందర్, మహేశ్, బాలనర్సయ్య, కంచం నర్సయ్య, రాజిరెడ్డి, దబ్బెడ రాజు, దేవిరెడ్డి, మంజుల, ఎం. మంజుల, వినోద, జ్యోతి పాల్గొన్నారు.

సాక్షి
జగిత్యాల
సోమవారం ¦ 5 ¦ జూన్ ¦ 2023



అంజన్న సన్నిధిలో రద్దీ

కొండగట్టు: కొండగట్టు అంజన్న సన్నిధిలో ఆదివారం రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 10వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు.



నమో నారసింహ

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం రద్దీ నెలకొంది. భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
39.0/28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేటి ప్రజావాణి రద్దు



కలెక్టర్ యాష్మిన్‌బాషా

జగిత్యాలటౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణలో జిల్లా అధికారులు, ఉద్యోగులు నిమగ్నమై ఉన్నందున సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ షేక్ యాష్మిన్ బాషా ఆదివారం తెలిపారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గ మనించి అధికార యంత్రాంగానికి సహకరించాల్సిందిగా కోరారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు వివేక్



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం

మల్యాల(చొప్పదండి): తాటిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి కొత్తపల్లి వివేక్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 6 నుంచి అనంతపూర్‌లో జరిగే 13వ మినీ సబ్ జూనియర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ అండర్–13 విభాగంలో తెలంగాణ తరఫున పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా వివేక్, పీఈటీ ఈరు బీరయ్యను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.గౌతమకృష్ణారావు అభినందించారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాలటౌన్: 2022–23 విద్యాసంవత్సరంలో ప్రతిభ కనబరిచిన విశ్వకర్మ కులస్తుల విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని విశ్వకర్మ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(వెవ) జగిత్యాల శాఖ ఆదివారం ప్రకటనలో తెలిపింది. పదో తరగతి, ఇంటర్, యూనివర్సిటీలతో పాటు మెడిసిన్ సీట్లలో సత్తాచాటిన విద్యార్థులకు వెవ ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేస్తామని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 94407 28999, 94902 85522 వాట్సాప్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఘన స్వాగతం



నరహరిని సన్మానిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

కోరుట్ల: మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరికి కోరుట్ల పద్మశాలీ సంఘం నాయకులు శనివారం రాత్రి ఘన స్వాగతం పలికారు. నరహరి మధ్యప్రదేశ్ నుంచి తన స్వగ్రామం బసంత్‌నగర్‌కు కారులో వెళ్తుండగా మార్గమధ్యలో కోరుట్లలో ఆగారు. కార్గిల్‌చౌక్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయనను పద్మశాలీ సంఘం నాయకులు సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, నాయకులు నాగభూషణం, గడ్డం మధు, జిల్లా ధనుంజయ్, ముల్క ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ పాలనలో మహిళలకు గౌరవం లేదు'



శ్రావణి

జగిత్యాల టౌన్ : జిల్లా కేంద్రంలో కేంద్ర గిడ్డంగుల, 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ ఫౌండేషన్ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ పేరు లేకపోవడం బాధాకరమని, ఇది మహిళలను అవమానించడమేనని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ నాయకురాలు భోగ శ్రావణి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మహిళలకు గౌరవం లేదన్నారు. మంత్రి ఈశ్వర్ ఆవిష్కరించిన శిలాఫలకంపై జెడ్పీ చైర్‌పర్సన్ పేరు లేకపోవడం మహిళా ప్రజాప్రతినిధులపై ప్రభుత్వ వివక్షకు నిదర్శనమన్నారు. పాలకవర్గంలో 11మంది బీసీ మహిళా కౌన్సిలర్లు ఉన్నా ఓసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని చైర్మన్‌గా కొనసాగించడం రిజర్వేషన్లు, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కడమేనన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచి రైతులు ఇబ్బందులు పడుతుంటే కోట్లాది రూపాయలతో రైతు ఉత్సవాలు నిర్వహించడమేంటని ప్రశ్నించారు.

రోల్లవాగుపైనే ఆశలు



కొనసాగుతున్న ప్రాజెక్టు పనులు

- ప్రాజెక్టు పూర్తయితే రెండు మండలాలకు సాగునీరు
- మూడు నెలలు పడుతుందంటున్న అధికారులు
- మొత్తం ఆయకట్టు 25 వేల ఎకరాలు
- రూ.60 కోట్ల నుంచి రూ.136 కోట్లకు చేరిన ప్రాజెక్టు వ్యయం

సారంగాపూర్(జగిత్యాల): రోల్లవాగు పనులు పూర్తయితేనే ఈ వర్షకాలంలో బీర్‌పూర్, ధర్మపురి మండలాలకు సాగునీరు అందనుంది. మరో 3 నెలల్లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతోందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. 2017 జూలైలో రూ.60 కోట్లతో బీర్‌పూర్ శివారుల్లోని రోల్లవాగు ప్రాజెక్టు ఆధునీకరణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పనుల జాప్యం, గత వానాకాలంలో భారీ వర్షాలు కారణంగా ప్రాజెక్టు మూడో కట్ట తెగిపోయి కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది. రెండేళ్లలో పూర్తి చేయాలనుకున్న పనులు వివిధ కారణాలతో ఆలస్యం కాగా, ప్రాజెక్టు వ్యయం రూ.136 కోట్లకు చేరింది.

ప్రాజెక్టు స్వరూపం..

రోల్లవాగు ద్వారా బీర్‌పూర్ మండలంలోని 15 గ్రామాలతో పాటు ధర్మపురి మండల కేంద్రంతో పాటు దోనూర్, దొంతాపూర్, దమ్మన్నపేట, మగిడి, జైనా, ఆరెపల్లి, రాజారం, నక్కలపేట, తుమ్మెనాల రైతుల పంటలకు సాగునీరు అందుతుంది. ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 0.25 టీఎంసీ కాగా, ఆధునీకరణ పూర్తయితే ఒక టీఎంసీకి చేరనుంది. దీని ద్వారా అధికారికంగా 15వేల ఎకరాలని అధికారులు చెబుతున్నా, 25 వేలకు పైగా ఎకరాలు సాగవుతాయి. ప్రాజెక్టు చుట్టూ గుట్టలు ఉండడంతో వర్షానికి గుట్టలపై నుంచి, వివిధ వాగుల నుంచి, ఎస్సారెస్పీ డీ–53,12 ఎల్‌ఆర్‌పీ మెయిన్ ద్వారా రోల్లవాగులోకి నీరు చేరి పంటలు సాగవుతాయి.

సాంకేతిక సమస్యలతో జాప్యం

ప్రాజెక్టు ఆధునీకరణ ప్రారంభం నుంచి పలు సాంకేతిక కారణాలతో పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. ప్రాజెక్టుకు కిలోమీటరున్నర కట్ట నిర్మించాల్సి ఉండగా మట్టిసేకరణ సమస్యగా మారింది. కోవిడ్ సమయంలో ఏడాది పాటు కూలీలు, టెక్నికల్ సిబ్బంది పనులకు రాకపోవడం, చేసిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం, అటవీశాఖ అనుమతులు రాకపోవడం మరో కారణం. వీటితో పాటు గత వర్షాకాలం పనులు పూర్తయ్యే సమయంలో భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టు కట్ట కొట్టుకుపోవడంతో దాదాపు 4 నెలలు పనులు స్తంభించిపోయాయి.

రైతుల్లో ఆందోళన

గత యాసంగిలో ప్రాజెక్టులోకి వచ్చే డీ–53, 12 ఎల్‌ఆర్‌పీ మెయిన్ ఎస్సారెస్పీ కాలువను డైవర్షన్ చేసి కేవలం 2వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందించారు. వర్షాకాలంలో ప్రాజెక్టు తెగిపోయి నాట్లు వేయాల్సిన పాలాల్లో నారు కొట్టుకుపోయి ఇసుకమేటలు వేయగా, వేలాది ఎకరాలు బీళ్లుగా ఉన్నాయి. కాగా ఈసారైనా పంటలకు సాగునీరు పూర్తిస్థాయిలో అందిస్తారో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రస్తుతం జరుగుతున్న పనులు

- ప్రాజెక్టు దిగువకు నీటిని విడుదల చేసేందుకు 3 తూములు ఏర్పాటు చేశారు. వీటిపై షటర్లు బిగింపునకు స్లాబ్‌లు నిర్మించాల్సి ఉంది.
- ప్రాజెక్టుకు 156 మీటర్ల పొడవు, 12.50 మీటర్ల ఎత్తుతో మత్తడి నిర్మాణం పూర్తయింది.
- ప్రాజెక్టు మొదటి కట్ట 425 మీటర్ల పొడవు ఉండగా, 80 శాతం పనులు పూర్తయ్యాయి. చెర్లపల్లి వైపు కట్టకు తెట్టె (రాళ్లతో బండ) అద్దే పనులు 20 శాతం మిగిలి ఉన్నాయి.
- రెండో కట్ట (300 మీటర్ల పొడవు) మొత్తం అటవీశాఖ పరిధిలో ఉండగా ఆ శాఖ అనుమతులు రావాల్సి ఉంది.
- మూడో కట్ట 860 మీటర్ల పొడవు, 16 మీటర్ల ఎత్తు పెంచాల్సి ఉండగా, ఇందులో 700 మీటర్ల కట్ట నిర్మాణం పూర్తి కాగా, మిగగా పనులు కొనసాగుతున్నాయి.

సెప్టెంబర్ వరకు పూర్తి చేస్తాం



ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయి. వచ్చే వర్షాకాలంలో పంటలకు ఎట్టిపరిస్థితిల్లోను పూర్తిస్థాయిలో నీరు అందిస్తాం. సెప్టెంబర్ మొదటి వారం వరకు ప్రాజెక్టు నిర్మాణం 100 శాతం పూర్తవుతుంది. పనులపై ఉన్నతస్థాయి అధికారులు, కలెక్టర్ సమీక్షిస్తున్నారు.

– చక్రూనాయక్, ప్రాజెక్టు డీఈ

దేశానికే రోల్ మోడల్ ఫ్రెండ్లీ పోలీస్



సురక్ష దివస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

- మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాలరూరల్: తెలంగాణ ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ దేశంలోనే రోల్ మోడల్‌గా నిలుస్తోందని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సురక్ష దివస్ ర్యాలీలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం పోలీస్‌శాఖను బలోపేతం చేసిందన్నారు. ఎక్కడా లేని ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని రాష్ట్రంలో కొనసాగిస్తున్నారని వివరించారు. మహిళల రక్షణకు షీ టీం, బ్లూకోల్ట్స్ పోలీసులు నేరం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరి సేవలందించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ యాష్మిన్ బాషా మాట్లాడుతూ, ప్రజల రక్షణ కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందని అన్నారు. అనంతరం ఎస్పీ ఎగ్గడి భాస్కర్ మాట్లాడుతూ, కొత్త జిల్లా ఆవిర్భావానికి ముందు జగిత్యాల ఒక డీఎస్పీ పర్యవేక్షణలో నడిచేదని, జిల్లా ఏర్పాటు తర్వాత ఎస్పీ స్థాయితోపాటు ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ముగ్గురు డీఎస్పీ స్థాయి అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. మహిళల సంపూర్ణ రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోందని వివరించారు. జిల్లాలోని రెండు పోలీస్ డివిజన్లలో ఎస్సై స్థాయి అధికారి నేతృత్వంలో రెండు షీ టీంలు ఏర్పాటు చేసి మహిళలపై వేధింపులు పూర్తిగా అరికట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, అదనపు కలెక్టర్లు లత, మకరంద, జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్‌రావు, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, డీఎస్పీలు ప్రకాశ్, రవీందర్‌రెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

దళిత సమాజంపై సీఎం వివక్ష

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వారిపై వివక్ష చూపుతున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ సిద్ధాంతాలు, ఎమ్మెల్సీ పనితీరు, పోరాటపటిమకు ఆకర్షితులై జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌కు చెందిన పలువురు యువకులు ఆదివారం ఇందిరాభవన్‌లో పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో దళితులకు మూడెకరాల భూమి తదితర హామీలు ఇచ్చి అమలు చేయకుండా, వారికి రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. దళితుల అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సైతం ఖర్చు చేయకుండా మోసం చేస్తున్న సీఎంకు రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. దళిత సీఎం హామీని విస్మరించిన సీఎం తన క్యాబినేట్‌లో జనాభా ప్రాతిపదికన ముగ్గురు దళితులకు మంత్రి పదవి ఇవ్వాల్సి ఉన్నా ఒక్కరికే అవకాశం కల్పించడం దళితజాతిపై సీఎం వివక్షకు నిదర్శనమన్నారు. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వంలోనే దళితులతో పాటు అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ధర రమేశ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ మధు, బల్దియా ఫ్లోర్ లీడర్ కల్లెపెల్లి దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో స్నేహితులు దుర్మరణం

- అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న బైక్
- రెండు గ్రామాల్లో విషాదం



కృపానంద్ (ఫైల్)



గంగాధర్ (ఫైల్)

జగిత్యాలక్రైం: నలుగురు స్నేహితులు సరదాగా కలిశారు.. మాటల్లో దిగారు.. ఆదివారం వేకువజామున రెండు బైక్‌లపై ఇళ్లకు బయలుదేరారు. ఈక్రమంలో ఓ ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మహంకాళి నర్సయ్య– కళావతి కుమారుడు కృపానంద్(22), మల్యాల మండలం ఒబులాపూర్ గ్రామానికి చెందిన బడుగు మొండయ్య– సుజాత కొడుకు గంగాధర్(19) స్నేహితులు. వీరితో పాటు మరో ఇద్దరు స్నేహితులు శనివారం రాత్రి జగిత్యాలలో కలుసుకున్నారు. లింగంపేట శివారుకు వెళ్లారు. ఆదివారం ఉదయం 3గంటల సమయంలో ఇళ్లకు బయలుదేరారు. కృపానంద్, గంగాధర్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ కొత్తబస్టాండు ఔట్ గేట్ వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరి తలలకు బలమైన గాయాలై ప్రమాదస్థలంలోనే మృతిచెందారు. పట్టణ ఎస్సై వేణురావు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు గంగాధర్ తండ్రి మొండయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాంచందర్‌రావు తెలిపారు.

రెండు గ్రామాల్లో విషాదం

నిత్యం కలిసిమెలిసి ఉండే ఇద్దరు స్నేహితులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో లక్ష్మీపూర్, ఒబులాపూర్ గ్రామాల్లో విషాదం నెలకొంది. వారి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

11న కవి సమ్మేళనం

జగిత్యాల: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 11న కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు కలెక్టర్ యాస్మిన్‌బాషా పేర్కొన్నారు. సమ్మేళనంలో పాల్గొనే కవులు జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. తెలుగు, ఉర్దూ కవితలు కనిష్ఠంగా 20 పంక్తులు, గరిష్టంగా 26 పంక్తులు మించకుండా ఉండాలని తెలిపారు. తెలంగాణ అస్తిత్వరం, తెలంగాణ ప్రగతి పూరితమైన కవితాంశాలు దినపత్రికలు, వార పత్రికల్లో ప్రచురించి ఉండకూడదన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 7న సాయంత్రం 94410 23599 మనోహరాచారికి వివరాలను వాట్సాప్ ద్వారా పంపించాలని సూచించారు.

ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న సభ్యులు

వెల్గటూర్(ధర్మపురి): ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా మండలంలోని స్తంభంపల్లి శివారులో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ పరిశ్రమను వెంటనే రద్దు చేయాలని మానవహక్కుల వేదిక, దళిత లిబరేషన్ ఫ్రంట్ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం ఇథనాల్ ప్రతిపాదిత పాశిగామ గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా ఇథనాల్ పరిశ్రమలకు అనుమతులిస్తూ ప్రజల ప్రాణాలకు ముప్పు తెస్తున్నాయని ఆరోపించారు. ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వ్యతిరేకించినందుకు గ్రామస్తులపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మానవహక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మధు, జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్, దళిత లిబరేషన్ ఫ్రంట్ సభ్యుడు మార్వాడి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



కోరుట్ల శివారులో కూలిన స్వాగత తోరణం



కథలాపూర్‌లో ధాన్యం బస్తాల వద్దకు చేరిన నీరు

కథలాపూర్/కోరుట్లరూరల్(వేములవాడ): మండలంలోని గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలుల వర్షం బీభత్సం సృష్టించింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిందని రైతులు వాపోతున్నారు. ఇప్పపెల్లి శివారులో తాటిచెట్టు విరిగి విద్యుత్‌వైర్లపై పడటంతో తెగిపోయాయి. ట్రాన్స్‌కో సిబ్బంది వైర్లను సరిచేసే పనుల్లో నిమగ్నమయ్యారు. కోరుట్ల మండలంలో పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. ఇళ్లపై రేకులు లేచిపోయాయి. దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణ శివారులో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన స్వాగత తోరణం పడిపోయింది.

పొలాస విత్తనాలకు డిమాండ్

- ఇటీవల విత్తన మేళాలో 300 క్వింటాళ్లు విక్రయం
- మరో 500 క్వింటాళ్ల వరకు విత్తన సంస్థలు, ప్రైవేట్ కంపెనీలకు..



ఇటీవల జరిగిన విత్తన మేళాలో విత్తనాల కోసం క్యూలైన్‌లో రైతులు

జగిత్యాల అగ్రికల్చర్: పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు రూపొందించిన వరి విత్తనాలకు డిమాండ్ పెరిగింది. ఇటీవల విత్తన మేళా ద్వారా ఒకేరోజు 300 క్వింటాళ్ల వరకు విక్రయించారు. మరో 500 క్వింటాళ్ల వరకు ముందస్తు ఆర్డర్లతో తెలంగాణ విత్తన సంస్థతో పాటు ప్రైవేట్ కంపెనీలకు విక్రయించారు. ఇక్కడ రూపొందించిన విత్తనాలు కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది.

మేలు రకం విత్తనాలు

వానాకాలం, యాసంగి సీజన్‌లో వరిలో విత్తనోత్పత్తి చేసి, మేలురకం విత్తనాలను రైతులకు సరసమైన ధరలకు అందిస్తున్నారు. ఈ ఏడాది 35 ఎకరాల్లో విత్తనోత్పత్తి చేశారు. నాణ్యమైన విత్తనాలను పరిశోధన స్థానంలోని ప్రాసెసింగ్ ప్లాంట్‌లో తప్పతాలు, మట్టిబెడ్డలు లేకుండా చూస్తారు. గతేడాది వానాకాలంలో 350 క్వింటాళ్లు బ్రీడర్ సీడ్, 1,200 క్వింటాళ్ల ట్రూత్‌ఫుల్ లేబుల్ సీడ్‌ను రైతులకు విక్రయించారు. ఈ ఏడాది విత్తనోత్పత్తి చేసిన పొలాల్లో చీడపీడలు, తెగుళ్లతో విత్తనోత్పత్తి అనుకున్న స్థాయిలో కాలేదు. 300 క్వింటాళ్ల బ్రీడర్ సీడ్, మరో 500 క్వింటాళ్ల ట్రూత్‌ఫుల్ లేబుల్ సీడ్ మాత్రమే విత్తనోత్పతి కాగా విక్రయించారు.

వివిధ రాష్ట్రాల సంస్థలకు..

పరిశోధన స్థానంలో తయారైన వరి బ్రీడర్ సీడ్ విత్తనాలను ఏపీ సీడ్స్, మహారాష్ట్ర, కర్ణాటక సీడ్స్ వంటి ప్రభుత్వ సంస్థలు, పలు ప్రైవేట్ కంపెనీలు కొనుగోలు చేస్తాయి. అవసరమైన సీడ్‌కోసం మూడునెలల ముందే దరఖాస్తు చేసుకుంటాయి. ఆర్డర్ల మేరకు ఆ సంస్థలకు కేటాయించి, మిగతా విత్తనాలను రైతులకు అందిస్తారు.

విత్తన మేళా ద్వారా విక్రయం

పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం వరి విత్తనాలకు పెట్టింది పేరు. జగిత్యాల రైస్–1 (జేజీఎల్–24423) రకాన్ని 25 కిలోల సంచిని రూ.1,000 విక్రయించారు. తెలంగాణ వరి–4 (జేజీఎల్–27356) రకం 20 కిలోలు రూ.880, తెలంగాణ వరి–3 (జేజీఎల్–28545) రకం 20 కిలోలు రూ.880, జేజీఎల్–24423 బ్రీడర్ సీడ్ 25 కిలోలు రూ.1945 చొప్పున విక్రయించారు.

బ్రీడర్ సీడ్‌కు డిమాండ్

పరిశోధన స్థానంలో వివిధ రకాలతో సంకరణం చేసి కొత్త రకం రూపొందిస్తారు. ఇలా తయారైందే న్యూక్లియస్ సీడ్. ఈ సీడ్‌ను కొంత విస్తీర్ణంలో పరిశోధన స్థానంలో సాగుచేస్తారు. దీని నుంచి వచ్చిందే బ్రీడర్ సీడ్. ప్రస్తుతం పరిశోధన స్థానంలో బ్రీడర్ సీడ్, ఫౌండేషన్ సీడ్‌ను అమ్ముతున్నారు. సర్టిఫైడ్ సీడ్‌ను ప్రైవేట్ కంపెనీలు ఉత్పత్తి చేసి బయటి మార్కెట్లో విక్రయిస్తుంటాయి. బ్రీడర్ సీడ్ కొనుగోలు చేస్తే ఆ పంటతో వచ్చే విత్తనాలను మూడు పంటలకు విత్తనాలుగా వాడుకోవచ్చు.

మంచి స్పందన



పొలాస వ్యవసాయ పరిశోధన నుంచి ఏటా బ్రీడర్ సీడ్ తీసుకువచ్చి లక్ష్మీపూర్ సహకార సంఘం ద్వారా విత్తనోత్పత్తి చేస్తాం. విత్తనోత్పత్తి కింద వచ్చిన విత్తనాలను రైతులకు విక్రయిస్తాం. పొలాస విత్తనాలకు రైతుల నుంచి స్పందన ఉంది.

– మామిడి తిరుపతిరెడ్డి, సంఘం డైరెక్టర్, లక్ష్మీపూర్

అమ్మకానికి సిద్ధం



పొలాస పరిశోధన స్థానంలో రూపొందించిన వరి విత్తనాలకు మంచి స్పందన ఉంది. ఇటీవల నిర్వహించిన మేళాలో విత్తనాలు విక్రయించాం. ఎప్పటికప్పుడు రైతులకు అవసరమైన విత్తనాలు తయారు చేస్తున్నాం.

– డాక్టర్ శ్రీనివాస్, పరిశోధన స్థానం డైరెక్టర్, జగిత్యాల